# పిచ్చి ఎవరిది?

శ్రీమతి కృష్ణకుమారిగారు

ఒకపెరడు. అది వీధివైపునవున్నది. దానికి రెండే గుమ్మాలున్నాయి. అది రెండుగజాల వెడల్పున నలుచదరంగా ఉంది. ఆ పెరడు ఒకగోడమీదనుండెవరో తొంగి చూస్తున్నారు. దొడ్లో 6 ఏళ్ల అబ్బాయి ఆడుకుంటున్నాడు. ఆ అబ్బాయిచేతిలో తెల్లగా ఒకరూపాయి ఉంది. సాయంతనము గోధూళికాసమయారంభము.

మామూలుగా పిల్ల లేది చేస్తూంటారో దానిలోనే మునిగిపోతారు. వాళ్ళ కితర చింత లేవీ మనస్సులోనే ఉండవు. తన్మయుండైన కవికి తనఊహే ప్రకృతి నంతా కమ్ము కొని కనబడినట్లు ఆటలధ్యానంలో ఉన్న పిల్లలకి తమఆటే కాని యింకొకటి వాళ్ల కళ్ళకే కనబడదు.

ఆ అబ్బాయి బొట్టనవ్రేలితో క్రింద నేలంతా గీరి వింతముగ్గులు పెడుతున్నాడు. చేతిలో ఉన్న రూపాయి ఎగురవేస్తున్నాడు. క్రిందబడ్డ రూపాయిని మళ్ళీ తీసికొంటు న్నాడు. ఏమిటో అస్పష్టంగా గొణుగు తున్నాడు. పైకేమీ వినబడ్డం లేదు. కాని పెదవులు మాత్రం ఒక్కనిముష మైనా మూతలుబడ్డంలేదు.

ఇల్లాగ ఒకగంట గడచింది. అబ్బాయి ఇంకా ముగ్గులు పెడుతున్నాడు. అలాగే రూపాయితో ఆడుకుంటున్నాడు. అలాగే ఇంకా ఇంకా గొణుగుతున్నాడు.

ఇపుడా పిల్లడిగొంతు హెచ్చింది— "ఓయ్ సూర్యుడూ, నీ కిదిగో రూపాయి యిస్తాను;తీసుకో!! నీలాగే నేనూ రూపాయీ కూడా తెల్లగా ఉన్నాం. మేము నీ దగ్గఱకు వస్తే ఇంకా ఎంత తెల్లబడతామో!..."

తొంగిచూస్తూన్న పెద్దమనిషి కిదేం బోధపడలేదు. ఆ అబ్బాయికి పిచ్చెత్తిందేమో అనుకొన్నాడు. గభాలుమని ఆ పెరడులోకి దుమికాడు ఆ పెద్దమనిషిగంతు ఆ అబ్బాయికి తెలియనే తెలియదు. "ఏమి టబ్బాయి, అల్లా చేస్తున్నావు?" అని మెల్లిగా భుజమ్మీద తట్టి అబ్బాయి నడిగాడు పెద్దమనిషి.

ఉన్మత్తు డులికిపడినట్లు ఎక్కడో తనభావనాప్రపంచంలో, తన చిన్నతనపుటాటల్లో, తన అవ్యక్తఆనందంలో లోతుగా మునిగిపోయి మనుష్యులతో స్నేహం వదిలేశాడేమో అన్నట్లు సూర్యునితో మాట్లాడుతూ ఆట్లాడుకుంటూన్న ఆ అబ్బాయి ఒక్కమా ఱీ పిలుపు విని చకితుడై పోయాడు. ఏమీ తెలియని ఆ చిన్నిహృదయం పరిచయం లేని కంఠం తన్ను తన లోకంలోంచి లేపఁగానే బెదరిపోయింది.

ఆ అబ్బాయిమొహం అరక్తమైపోయి పెద్దభయాన్ని తెలియజేస్తూంది.

వెంటనే ఆ అబ్బాయి వెఱ్ఱిచూపులు చూస్తో ఆ పెద్దమనిషి చేతుల్లోనే వాలిపోయాడు.

ఈ అబ్బాయిప్రతిబింబ మేమో అనేటట్టు సూర్యుడు కూడా ఎఱ్ఱబడి అంధతమస్సులోకి వాలిపోయాడు.

నిజంగా పిచ్చి ఎవరిది?